డీ-53 కాల్వకు మరమ్మతులెప్పుడో?



లక్ష్మీదేవిపల్లి శివారులో దెబ్బతిన్న లైనింగ్



లక్ష్మీదేవిపల్లి శివారులో ప్రధాన కాల్వకు గండిపడి కాల్వలో చేరిన ఇసుక

- పలుచోట్ల దెబ్బతిన్న సిమెంట్ లైనింగ్
- బ్రిడ్జీలకు ఇరువైపులా దెబ్బతిన్న సేఫ్టీవాల్స్

సారంగాపూర్: జిల్లాలోని పలు గ్రామాల్లో 64 వేల ఎకరాలకు సాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ-53 ప్రధాన కాల్వకు మరమ్మతులు లేక చివరి భూములకు సాగునీరందడం లేదు. దీంతో కాల్వకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాల్వ పొడవు 53 కిలోమీటర్లు..

జగిత్యాల జిల్లాలోని 35 శాతం సాగుభూములకు నీరందించే డీ-53 ప్రధాన కాలువ పొడవు 53 కిలోమీటర్లు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామ శివారుల్లో ప్రారంభమయ్యే ప్రధాన కాలువ వెల్గటూర్ మండలం కోటిలింగాల వద్ద ముగుస్తుంది. ఆయా మండలాల్లోని వ్యవసాయ భూములకు ఎస్సారెస్పీ నుంచి ప్రతీ తడికి 850 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ప్రధాన కాలువలో ఇరువైపులా ఏర్పాటు చేసిన సిమెంట్ లైనింగ్ చాలా చోట్ల దెబ్బతింది. దీంతో ఎగువ నుంచి వచ్చే నీరు చాలా చోట్ల వృథాగా పోయి నీటి ప్రవాహం తగ్గుతోంది. లైనింగ్‌ను ఆనుకుని కాల్వ వెలుపలి వైపు ఉన్న మట్టిని అక్రమార్కులు తీస్తుండడంతో వర్షపు నీరు, ఎస్సారెస్పీ నీరు లైనింగ్‌పై నుంచి వేగంగా ప్రవహించడంతో లైనింగ్ పగిలిపోవడం, బుంగలు పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. 53 కిలోమీటర్ల పొడవుతో ఉన్న ఈ కాలువలో ప్రతీ కిలోమీటరుకు ఒకటి రెండు చోట్ల లైనింగ్ చెడిపోయిందని అధికారులు పేర్కొంటున్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ-బుగ్గారం మండలాల మధ్య కాలువలో పూర్తిగా లైనింగ్ నిర్మించాల్సి ఉంది.

సింగిల్ రోడ్డు బ్రిడ్జీలకు మరమ్మతులు

డీ-53 కాల్వ ఏర్పాటు సమయంలో పలుచోట్ల బ్రిడ్జీలు నిర్మించారు. అందులో 6 బ్రిడ్జీలకు మరమ్మతులు చేపట్టాలి. సారంగాపూర్- జన్నారం ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి వద్ద, సారంగాపూర్ మండలంలోని రంగపేట గ్రామ శివారుల్లో బ్రిడ్జికి ఇరువైపులా సేఫ్టీవాల్స్ కూలిపోవడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణిస్తున్నారు.

యూటీల వద్ద సమస్య..

డీ-53 ప్రధాన కాలువకు అవసరమైన చోట మొత్తం 28 యూటీలను నిర్మించారు. గుట్టలపై నుంచి వాగుల ద్వారా వచ్చే నీటిని కాల్వలోకి వెళ్లకుండా యూటీల ద్వారా వెళ్లిపోవడానికి వీటిని ఏర్పాటు చేశారు. యూటీల్లో ఇసుక, మట్టి చేరడంతో వర్షపు నీరు తిరిగి కాల్వలోకి చేరి కాలువలు కోతకు గురికావడం, మట్టి, ఇసుక చేరుతోంది. దాదాపు 10 యూటీల వరకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.. సారంగాపూర్ మండలం రంగపేట, లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతాల నుంచి వచ్చే నీరు, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్ సమీపంలోని గుట్టల ద్వారా వచ్చే నీరు నేరుగా కాల్వలోకి చేరి భారీగా ఇసుక మేటలు ఏర్పడ్డాయి.

ఉపాధిహామీలో పూడికతీత

డీ-53 ప్రధాన కాల్వలో చాలా చోట్ల పూడిక చేరింది. కాలువ వెంట ముళ్లపొదలు, చెట్లు ఏర్పడ్డాయి. వీటిని తొలగించడానికి గ్రామీణ ఉపాధి హామీలో పనులు చేయించవచ్చు. కాగా ఉపాధికూలీలతో పూడికతీయడానికి సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ కారణంగా ప్రతీ ఏడాది పనులు నిర్వహించడం సాధ్యం కావడం లేదు.

మరమ్మతుకు ప్రతిపాదనలు పంపించాం

లైనింగ్ చెడిపోయిన చోట తిరిగి మరమ్మతులు చేపట్టడం, సింగిల్‌రోడ్డు బ్రిడ్జీలకు మరమ్మతులు, యూటీల మరమ్మతులకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– చక్రూనాయక్, డీఈ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

కొండగట్టు అంజన్నను మోసం చేసినందుకే కేసీఆర్‌కు ఓటమి

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు



అంజన్నను దర్శించుకుంటున్న హనుమంతరావు

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి రూ.500కోట్లు కేటాయిస్తానని మోసం చేసినందుకే కేసీఆర్ గత ఎన్నికల్లో ఓడిపోయారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు అంజన్న మహిమగల దేవుడని, ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని అంజన్నకు మొక్కుకున్నట్లు వివరించారు. కేసీఆర్ ప్రతిమాట అబద్ధమేనన్నారు. అభివృద్ధి చేసి ఓట్లు అడగాలని, దేవుడి పేరుచెప్పి అడుగొద్దని పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి నిధులు



నర్సింహునిపేట పాఠశాలలో అభివృద్ధి పనులు

పెగడపల్లి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం విదితమే. పెగడపల్లి మండలంలో మన ఊరు-మనబడి పథకం కింద 13 పాఠశాలలు ఎంపిక చేసి పలు అభివృద్ధి పనులు చేశారు. మిగతా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు పాఠశాల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. మండలంలో 20 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీలు ఏర్పాటైన 20 పాఠశాలలకు రూ.1.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ నిధుల వినియోగానికి గ్రామాఖ్య సంఘాల అధ్యక్షులు, హెచ్‌ఎంల పేరిట బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి ఖర్చు చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాల గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలి

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మన ఊరు-మన పాఠశాల కింద మంజూరైన రూ.30 లక్షల నిధులతో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని, రెండేళ్లుగా చిన్న పిల్లలకు చెట్ల కింద కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయించి విద్యార్థుల ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాపు రైతు సేవా సంఘం అధ్యక్షుడిగా గంగన్న

రాయికల్: మండలంలోని కిష్టంపేట కాపు రైతు సేవ సంఘం అధ్యక్షుడిగా కచ్చకాయల గంగన్న, ఉపాధ్యక్షులుగా జవ్వాజి మల్లయ్య, కోశాధికారిగా తంగెళ్ల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా కచ్చకాయల రమేశ్, ఉపాధ్యక్షులుగా నల్లాల మల్లేశం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ పటిష్టతకు కృషి చేస్తానని గంగన్న తెలిపారు.

కరాటేలో విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లు

కోరుట్ల: పట్టణంలోని ఒకినోవ స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు బ్లాక్ బెల్టులు సాధించినట్టు కరాటే కోచ్ అల్లె రమేశ్ సోమవారం తెలిపారు. కరీంనగర్‌లో ఆదివారం జరిగిన బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పలు అంశాలపై ట్రైనింగ్ పొందిన మర్రిపల్లి బాని, బోడ నందిని, కటుకం హేమంత్, అంకం సంతోష్, అంబేరి రణధీర్, ఆది ప్రభాస్ గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొని బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్లు సాధించారు. వీరికి తెలంగాణ చీఫ్ వసంత కుమార్ బ్లాక్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాహుల్, జయదేవ్, హేమంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి అభినందన

పెగడపల్లి: ఒకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్న పెగడపల్లికి చెందిన క్యాస రాజశేఖర్ అనే యువకుడు బ్లాక్‌బెల్ట్ రెండో డిగ్రీ సాధించి, బ్లాక్ బెల్ట్ రెండో డిగ్రీ ధృవీకరణ సర్టిఫికెట్, ప్రశంస పత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రామకృష్ణ అభినందించారు.

11న బీర్‌పూర్ మండల సమావేశం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మసర్తి రమేశ్ అధ్యక్షతన ఈ నెల 11న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో లచ్చాలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

భూ విషయంలో మోసం చేసిన నలుగురిపై కేసు

కరీంనగర్‌క్రైం: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే భూమిని పలువురికి అమ్మి కొనుగోలుదారును మోసం చేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా, అందులో ఒకరిని రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన గంగిరెడ్డి భీంరెడ్డి ప్రస్తుతం మహారాష్ట్రలోని పూణెలో నివాసం ఉంటున్నాడు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలో గల భూమిని కొనుగోలు చేశాడు. భీంరెడ్డి ఏళ్ల తరబడి పూణెలో ఉండడం గ్రహించి అతడి స్నేహితులు కిరణ్‌రెడ్డి, సునీల్ కలిసి సదరు స్థలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో కిరణ్‌రెడ్డి తన భార్య సుకన్య పేరు మీద డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈక్రమంలో భీంరెడ్డి సదరు స్థలం వద్దకు వెళ్లగా చంపుతానని బెదిరించాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపిడి మాధవరావు, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సుకన్య, సునీల్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోమవారం లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎస్సైకి ప్రశంస పత్రం



ప్రశంసపత్రం అందుకుంటున్న ఎస్సై సతీశ్

గొల్లపల్లి: మండలంలో లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన గొల్లపల్లి ఎస్సై సతీశ్‌కు జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సోమవారం ప్రశంస పత్రం అందించారు. నోటిఫికేషన్ నుంచి పోలింగ్ వరకు క్రమశిక్షణతో, అప్రమత్తంగా ఉంటూ నిర్వహించడం వల్లే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైని పలువురు అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన దండవేణి అశోక్‌పై అదనపు వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. చింతకుంట గ్రామానికి చెందిన దండవేణి అశోక్, హిమజకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. ఇటీవల అదనంగా రూ. 2 లక్షల వరకట్నం తీసుకురావాలని అశోక్ వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: మండల కేంద్రంలో చాలా రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు పలువురు సోమవారం సోషల్ మీడియా ద్వారా తహసీల్దార్ రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నాలుగు రోజుల నుండి తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, వీధి దీపాలు చాలా రోజుల నుంచి పనిచేయడం లేదని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్, కార్యదర్శి ప్రేమలత గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. తాగునీటికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువులు,విత్తనాల దుకాణాల్లో తనిఖీ

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో ఎరువులు, విత్తనాల దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏవో యోగితా, ఆర్‌ఐలు రాహుల్, నాగేశ్, ఏఈవోలు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను పరిశీలిస్తున్న జ్యోతి

జగిత్యాల: పరిశుభ్రత అందరి బాధ్యతని, పట్టణంలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు డ్రెయినేజీలను పరిశీలించి మాట్లాడారు. రోడ్లపై మురికినీరు నిలువ లేకుండా చూడాలని, చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు పారదోలేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్య పనుల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.ఆమె వెంట కౌన్సిలర్ లావణ్య, నక్క జీవన్ ఉన్నారు.

రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

జగిత్యాలరూరల్: రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనని జగిత్యాల రూరల్ ఎంపీపీ మంగళారపు మహేశ్ అన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోరపల్లి ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకెళ్లారు. విత్తనాల కొరతతో రైతులు రోజుల తరబడి తిరగాల్సి వస్తుందన్నారు. ఏవో తిరుపతినాయక్ రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలు అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, చెట్లు కొట్టేయడం సరికాదని, కొమ్మలు మాత్రమే కొట్టాలని అధికారులను ఎంపీడీవో రమాదేవి ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి అన్ని గ్రామాల్లో ఆర్టీసీ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మహేశ్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉపాధిహామీలో చెరువులు, కుంటల్లో పూడికతీయించి, ఎస్సారెస్పీ కాలువలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీవో రమాదేవి మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను జూన్ 12లోపు పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన ఎంపీపీ, ఎంపీటీసీలు

రాయికల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12 గంటల వరకు సభ్యులు హాజరు కాలేదు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, ఎంపీవో సుష్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. బోర్నపల్లి ఎంపీటీసీ పెంద్రం కవిత, భూపతిపూర్ ఎంపీటీసీ మహేశ్వర్‌రావు, కుమ్మరిపల్లి ఎంపీటీసీ దొంతి నాగరాజు, మైతాపూర్ ఎంపీటీసీ మధుకర్ మాత్రమే హాజరయ్యారు. భూపతిపూర్ ఎంపీటీసీ మహేశ్వర్‌రావు మాట్లాడుతూ అధికారులు విత్తనాల కొరత లేకుండా చూడాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరైనప్పటికీ ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేశంలో ఎంపీవో సుష్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

వెల్గటూర్ : తమతో పాటు కలిసి పదో తరగతి వరకు చదువుకున్న స్నేహితుడు అకాల మరణం చెందడంతో బాధిత కుటుంబానికి తోటి స్నేహితులు చేయూతనందించారు. వివరాల్లోకి వెళ్తే.. వెల్గటూర్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమతో పాటు చదువుకున్న మూగల రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, 5 ఏళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో స్నేహితులు తలా కొంత జమ చేసి ఇద్దరు పిల్లల పేరున రూ.30 వేల చొప్పున మొత్తం రూ.60 వేలు పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, సంబంధిత బాండ్‌లను స్నేహితుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు సంపత్, లక్ష్మణ్, సతీశ్, అఫ్సర్, వెంకటేశ్, తిరుపతి, అశోక్, శ్రీకాంత్, పుష్పలత, మల్లిక, నారాయణ, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామ్‌లు సేవలు చిరస్మరణీయం

కోరుట్ల/మల్లాపూర్/మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు కోరుట్ల జువ్వాడిభవన్‌లో, మెట్‌పల్లి, మల్లాపూర్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులు, మహిళలు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ ఓబీసీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాదర్ గౌడ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ లోగోలో డీఎస్పీ ప్రతిపాదనలు అమలు చేయాలి

జగిత్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించనున్న ప్రభుత్వ లోగోలో ధర్మసమాజ్ పార్టీ ప్రతిపాదనలను పరిశీలించి అమలు చేయాలని డీఎస్పీ కన్వీనర్ దూడ తిరుపతి కోరారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు సోమవారం డీఎస్పీ నాయకులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రూపొందిస్తున్న కొత్త లోగోలో సర్వాయి పాపన్నగౌడ్, పండగ సాయన్న, సమ్మక్క సారలమ్మల చిత్రపటాలను పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగరాజం, రమేశ్, కిశోర్, బాబు, వంశీ పాల్గొన్నారు.

సభలు,సమావేశాలకు అనుమతి లేదు

మల్యాల: మండలంలో అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు, బహిరంగ సమావేశాలు నిషేధమని సీఐ నీలం రవి తెలిపారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని పేర్కొన్నారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, రాస్తారోకోలు, సమావేశాలు నిర్వహించరాదని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించవద్దని, శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని ఊటిపెల్లిలో సోమవారం శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం మంచాల వెంకటేశం- సుజాత దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించి, యజ్ఞం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.ఉత్సవాల్లో కులసంఘాల ప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గంగామాత కల్యాణం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెంపేటలో గంగామాత కల్యాణం ఘనంగా జరిగింది. సోమవారం ఆలయంలో అర్చనలు, అభిషేకాలు,కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజ మహోత్సవం

గొల్లపల్లి: మండలంలోని భీమ్‌రాజుపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చింతపంటి శశికళ, తిరుపతి రెడ్డి, ఆలయ చైర్మన్ బొమ్మెన కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సీతారాముల కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు, శోభాయాత్ర, మహిళల కోలాటాలు,యువతీ యువకుల నృత్యాలు నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైక్లింగ్‌తో ఆరోగ్యమైన సమాజం



మాట్లాడుతున్న వాల్గొట్ కిషన్

మల్లాపూర్: ప్రతిరోజూ సైక్లింగ్ చేస్తే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని రాష్ట్రపతి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు వాల్గొట్ కిషన్ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని ఒబులాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిలింగ్‌తో అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. షుగర్, రక్తపోటు, ఊబకాయాన్ని నివారించవచ్చన్నారు. ప్రజలందరూ నిత్యం సైక్లింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఖానాపూర్ సైక్లింగ్ క్లబ్ కన్వీనర్ శ్రీరాముల వేణుగోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్, వంశీకృష్ణ

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లిలో పాకాల రాజిరెడ్డి, దయ్యాల రాయనర్సు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ సోమవారం పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు ఉన్నారు.

బడిబాట ప్రారంభం



ర్యాలీలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో సోమవారం ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మంచి విద్య, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనివాస్,హెచ్ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌కు విద్యార్థుల సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో థర్డ్ ఇయర్ ఈసీఈ విభాగం విద్యార్థులు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిట్ల ప్రభాకర్‌ను సన్మానించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని, అభివృద్ధిలోకి రావాలని అదే విధంగా కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో సాయి సంజయ్, వినయ్, నవీన్, సాయి తేజ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లిక్ తేజను ఉద్యోగం నుంచి తొలగించండి

జగిత్యాలటౌన్:తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు మల్లిక్‌తేజను ఉద్యోగం నుంచి తొలగించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు డిమాండ్ చేశారు. రాష్ట్ర గీతమైన జయజయహే తెలంగాణపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయన వ్యాఖ్యలపై సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సాంస్కృతిక సారధిలో కళాకారుడిగా ఉండి ప్రభుత్వ వేతనం పొందుతున్న మల్లిక్‌తేజ వ్యతిరేకంగా మాట్లాడటమేంటని ప్రశ్నించారు. నాయకులు ఆసది హరీశ్, రజ్జిబాబా, కోంద్ర రాజేశ్, మధుకర్‌రెడ్డి, వినయ్, అద్నాన్,రవి, నారపాక రెడ్డి, ప్రణయ్ తదితరులు ఉన్నారు.